వెలి

౧

తిరుమలాచార్యులు గుంటూరు హైస్కూలువదలి కలకత్తా—బ్రహ్మసమాజ—కాలేజిలో ప్రవేశించెను. వెంటనే తిరుమలరాయ్ అని పేరు మార్చివేసెను.

కలకత్తాలో తిరుమలరాయ్ పొట్టిపేరు రాయ్. ఇంటి కడ ఆచార్లు.

వాదములందు అతఁడు ఇష్టసాహసుఁడు. సహాధ్యాయుల సమ్మేళనములందు రాయి ఆస్తికులతోపాటు నాస్తికులఁ గూడ ఖండించెను. అతఁడు క్రీస్తుమతమును ఏకి బ్రాహ్మమతమును సాకలేదు. మత మనునది అతనిపాలిట మూఢవిశ్వాసము. దానిగుఱించి యెంత వాదించినను వాగ్వ్యయము కాదు. అతఁడు సంశయవాదియో యదృచ్ఛావాదియో నిరీశ్వరవాదియో, ఇంతవఱకు ఎవరికిని తెలియలేదు.

అతఁ డపుడపుడు సాంఘికధర్మములగుఱించి తనజట్టునకు చెప్పుచు వచ్చెను. 'వివాహవిధి మనుష్యుఁడు విధించుకొనిన క్రూరనరకము. ప్రేమ చలము; అది ఏకమాత్రనిష్ఠము కాదు' అని.

అతనివాదముల కబ్బురపడి చాలమంది అనుయాయులై అతనిని తమకు నాయకునిగా అంగీకరించిరి. కొందఱు అతఁ

ఇరువదవ శతాబ్దికి మూలపురుషుఁడును, మతకర్తయును కాఁగ లఁడని తమ దూరదృష్టితో చూచిరి.

అతఁడు వాదములలో శరప్రయోగము చేసెనా లక్ష్యమును వేధించి తీరెను. అతఁడు కొండవలె తలయెత్తుకొని తిరిగెను. రాజువలె ఆత్మగౌరవము రక్షించుకొనెను. దేశనాయకునివలె పలుమందిని తన చెప్పు చేతలలో ఆకట్టెను. అన్నిటికంటె తనకు ప్రకృతమైన చదువులో మొదటివాఁడుగా నిలుచుండెను.

సెలవులలో రాయి స్వగ్రామమునకువచ్చి ఆచార్లుగా మారెను. వారిగ్రామ మంత పల్లియయుఁ గాదు; బస్తీయుఁ గాదు. హోటలులేదు కాని కాఫిహోటలు కలదు. స్కూలు ఫైనలు తప్పినవారు దానికింది క్లాసులు తప్పినవారితోపాటు పలువురు; బ్రాందిషాపుతోపాటు సోడాషాపు. రోడ్డు ఊరి నడుమ లేదు కాని ఊరంటుకొని పోవును. కోర్టు లేదు కాని పంచాయతీకోర్టు. తగవులతోపాటు సబ్బందుతీర్పులు. దినుసుల వెల యిబ్బడి. అలికిజనము మిక్కుటము. క్రొత్తగా వెలసి పాడుపడిన పడ్డమరల రేసుపాకలు. దాపున కాలువ. ఇట్టి ఈగ్రామమునకు ఆచార్లు టెన్నిసుకోర్టుతో ఒక క్రొత్తశోభ కలిగించెను. చుట్టుపక్కల యిండ్ల ఆఁడువారు ఆటవారిని పనిపాటలుకూడ మానుకొని చూచుచుండిరి. వారిలో ముఖ్యముగా ఆబంగాళాబాబును.

ఆచార్లతల్లి మూఁడుకాళ్ల ముసలి. ఆమె తనకొడుకు ఇంచుమించుగా ఇండియా నేలు ననుకొనును. అతని కెదురాడదు. సలహాచెప్పుటకుఁగూడ జంకును. అన్నమునకు తొందర పెట్టదు. ఒకనాఁ డతఁడు టెన్నిసు సన్నాహముమీఁద నుండగా ఆతొందరలో తన అధికారము బయటఁబడ దనుకొని— నాయనా, నీపెండ్లి కనులారఁ జూచుకొని మరి మరణింపవలెనని నాకోరిక అనెను.

'అమ్మా! నాపొట్ట పోసికొనుట నేను నేర్చుకొననిదే ఇంకొక పొట్టనుగూడ నేల తెచ్చికొనవలయును?'

'ఏమినాయనా, రంగనాథుని అనుగ్రహమువల్ల గ్రాస వాసోదైన్యము లేదు. నీవు ఉద్యోగము చేయఁదలఁచినచో గానేరకావా? నాకన్ను లున్నందులకు ఏమిఫలము?'

'అమ్మా, గవన్నరే? పొరపాటు పొరపాటు. ఈకాలమున రెవిన్యూ ఇన్స్పెక్టరుకూడ కాలేను. దేవుని డబ్బు తినుటకా యిఁక? ఆఁడువి కూర్చుండి తినలేదా? పరీక్షలు నెలలో తేలును. వెంటనే కోడలిని నీకు చూపింతును.'

'మానాయన మానాయన! కానీ తొందరగా కానీ!'

౨

టెన్నిసు

టెన్నిసు ఆహవా రంభలు ఆచార్లకింపకయాయు ఆచార్యుని మించినవారే.

నాఁడు బంతి అందించు బాలసేవకులు రాలేదు. ఆటతమ కమున ఎవరిబంతి వారే తెచ్చికొనుచుండిరి.

ఆబంతులలో ఒకబంతియందు ఆచార్లకు కడుఁ బ్రీతి. అది మాయామృగమువలె చెంగు చెంగున దుమికి పక్క గుడి సెకడఁ బడెను. మెఱుపువలె మెఱసి ఒకామె దానిఁ దీసి లోని కేఁగెను.

ఆచార్లు రెం డడుగులు వైచి తల యెత్తిచూచి వెను దిరిగెను. మఱియొకబంతితో ఆటసాగెను.

అటుతరువాత ఆచార్లే ప్రతియాటయు ఓడెను. తన మీఁదఁ బడకుండ కొన్ని బంతులను చేతితోఁ గొట్టి తప్పించు కొనెను. మీఁదఁ బడిన కొన్ని బంతుల నెఱుఁగనే యెఱుఁగఁడు.

సూర్యుఁడను బంతి విధిచే నేలకుఁ గొట్టఁ బడెను. అది అస్తాద్రి గుహాగృహము దూరెను.

వల, బంతులు, బాటులు జాగ్రత్తపెట్టించుటకు ఆచార్లు క్రీడాక్షేత్రమున నుండెను. మిగిలినవా రందఱు విసిరి కొట్టిన బంతులవలె పాఱిపోయిరి.

ఆచార్లు గుడిసెవైపునకు అడుగులు వైచుచుండెను. మెఱుఁగుఁ దీఁగవంటి యొక జవ్వని తొంగితొంగి చూచి లోప లికి లోపలి కొక్కొక అడుగే వేయుచుండెను. ఆచార్లు గుమ్మము చుట్టు పక్కల చూచెను. ఎవరును లేరు. చేతులు ద్వారము

నకు ఆనించి మోము లోపలఁ బెట్టి చూచెను. ఎవరును లేరు. లోపలికి వెళ్లెను. మధ్యము దారపుఁగండెలు తక్క నెవరును లేరు. గదిగుమ్మములో తలపెట్టి చూచెను. ఎవరును లేరు. లోనికివెళ్లెను. మూల ఒక జీవత్ప్రతిమ నిలువఁబడియుండెను. అతఁడు 'నాబంతి యేది ?' అని అడిగెను.

ఆజీవత్ ప్రతిమ 'నా కేమి తెలియును?' అని పైఁట సవరించుకొనెను. సవరణయొక్క ఉద్దేశము నెఱవేఱెను.

ఆచార్లు నాబంతి నాకిమ్మనెను. బంతి మరికొంచె మెక్కువగా లోనికిఁ జనెను.

ఆచార్లు కొంచెమునే పదేపనిగా చూచెను. సమీపించి పైఁటలోని బంతిని మృదువు మృదువుగా లాగికొన యత్నించెను. పైట క్రమ్మఱఁ గ్రమ్మఱ సవరించుకొనుటచే బంతి క్రిందఁ బడునట్లు కానిపించియు లోనికే పోయెను. అతఁడు నేర్పుగా తీయఁజూచెను. ఈలోపుగా అది ఆకాశమున కెగిరి అటకమీఁద అటికలో కూర్చుండెను. దానితో ఒక క్రొత్త బంతియాట మొదలాయెను.

దాని పేరు రంగి. రంగిని రంగమ్మ యనియో రంగనాయిక యనియో వ్యవహరించుచో దానికి క్రొత్త లావణ్యము రాదు. పేరులో ఏమున్నదని అందురు కాని రంగికి బదులు రంగనాయిక యన్నచో పదమునకు ఉన్న లావణ్య మూడదు.

కవి నిరంకుశుఁడై తన్నెక్కడ దుర్వినియోగము చేసిపోవునో యని ఒకానొకపుడు పదములు కూడ భయపడుట కలదు.

లోకులు దాని రంగి యందురుగాక! ఇచట రంగనాయికం. అసలు దానిపే రదియే నేమో! నామకరణము సుబ్బమ్మ. వాడుకలో సుబ్బి.

ఆచార్లు 'నీ పేరేమి ?' అని అడిగెను. రంగనాయిక 'నా పేరు రంగి-నా పేరు-రంగ' అనఁబోవుచుండఁగా అతఁడు-'కాదు, నేనొక పేరు పెట్టుదును, 'కందుకావతి' అని, 'కందుకావతీ!' అని పిలిచెను. 'ఏమి ?' అని ప్రత్యుత్తరము వచ్చెను. ఇరువురును నవ్వుకొనిరి.

'నీ కొక పేరు నేనును పెట్టెద' నని కందుకావతి అనెను. ఆచార్లు 'ఏమిపే' రని అడిగెను. కందుకావతి-'రంగనాథుఁడు' అనెను. ఆచార్లు 'నీవీ పేరు పెట్టినందులకు బదులు నేను ముద్దు పెట్టెద' ననెను.

కందుకావతి వెనుక వెనుక కొదిగి తల్పమున కానుకొనఁగా ఆచార్లు ముందు ముందులకుఁ జని కవ్వించి ముద్దాడెను.

వాకిట దగ్గు.

విని రంగనాథుఁడు త్రుళ్లిపడెను. కందుకావతి లోలోన నవ్వుకొనుచుండఁగా రంగనాథుఁడు వెలుపలికి వెళ్లెను. జబ్బుతో తీసికొనుచున్న నరసింహులు—'ఏమి బాబూ, మాయిల్లు

పుణ్యక్షేత్రము చేసితిరి!' అనఁగా ఆచార్లు—'నాబంతి మీ యింటఁ బడినది, అందులకు వచ్చితిని' అనెను.

'దొరికినదా ? ఏదీ ?'

'లేదు. అటకమీఁద పడినదఁట.'

'ఓసీ బాబుగారికి తీసియిమ్ము'

'ఇపుడు పనిమీఁద ఉన్నాను; రేపు తీసి యిచ్చెదను.'

3

మఱునాఁడు బంతికొఱకు ఆచార్లు కందుకావతి యింట నుండెను.

'పెండ్లి యాడనని ప్రతిజ్ఞ చేయుము.'

'ఇంక సాగుచో పెండ్లి యేల ?'

'జాగ్రత్త జాగ్రత్త! ఇంకా ? నామాట బొంకని తోఁచుచో నిన్నటి ముద్దులతోనే ఆఖరు. ఐనను నీవు నాకు పతివి-పరిత్యక్త పతివి. మరల వినుము. నాఁటికి నాతలిదండ్రులు చచ్చినెల. నరసింహులు నా మేనత్తకొడుకు. త్రాగుబోతు. నే నొక నాఁడు నిద్రపోవుచుంటిని. కలలోవలె కొంత యేమో వినఁబడెను. లేచి చూచితిని. పక్కన పురోహితుఁడు. నామీఁద పసపు బట్ట. మెడలో తాళి. తాళి తెంపి పురోహితుని కాళ్లకు కట్టితిని. నన్ను పట్టుకొని పలువురు మరల కట్టిరి. తెంపి పోసి మన్యములలోనికి పాఱిపోతిని. పాడు నరసింహులు వెదు

కుచు వచ్చెను. వచ్చిననాఁడే జ్వరమునకు బలియాయెను. నేటి కిని అదియే జ్వరము. పాపఫలము వెంటనే కానిపించెను. వాఁ డిపుడు నా పోషణలో ఉన్నాఁడు. వింటివా? దానఁజేసియే నాకు వాని భీతిలేదు. పైగా నేనన్నవానికి భీతి. నిన్న నీవు తొట్రిలి వాకిటికి పరువెత్తితివి. నీకు వెనుకఁగూడ కన్నులు కలుగుచో అపుడు నా నవ్వు చూచియుందువు. వింటి వా? పోనీ నరసింహులనే అడిగిచూడుము. లేక నేనే నీముం దడిగెదను.'

ఆచార్లు ఆలోచించి ఆలోచించి పలుమాఱులు సమా ధానము చెప్పవచ్చియు ఆఁగిపోయెను.

కందుకావతి—'తొందరలేదు. ఆలోచించుకొనుము' అనెను.

'నాకొంప తప్పుటకు ఎవరా యాలోచన?' అని వాకిలి పలికెను.

ఆచార్లు లేచెను కందుకావతి నవ్వెను. నవ్వి చేయి పట్టు కొని కూర్చుండఁబెట్టెను. నరసింహులు లోనికి వచ్చి—'తమరా బాబయ్య! ఎఱుఁగక అంటిని. అయ్యా! తమబంతి యింకను దొరకలేదా? అవును దొరకదు; అవును దొరక' దనెను.

కందుకావతి నరసింహులకేసి ఒకచూపుచూచెను. జ్వర మునకుఁగూడ నతఁడంత కంపింపలేదు.

ఆచార్లు అటక యెక్కి బంతి తీసి కిందఁబడవైచెను. కందుకావతి చేకొనెను. ఆచార్లు దిగి రాఁగనే బంతిచూపి కందుకావతి మరల దాని నటకమీఁద వైచెను.

ఆచార్లు చేగడియారమున నాలుగుగంటలు చూచి టెన్నిసురంగమున సహచరుల కెదురు చూచెను.

నాఁడుకూడ ప్రతియాటయు తానే ఓడెను. ఆచార్యులనాచార్యులాయెనని సహచరులు గేలిచేసిరి. నవ్వుచు అతఁడింటికేఁగెను. క్రమక్రమముగా అంధకార మావరించెను.

నడికిరేయి అనుకోకుండ కందుకావతికి కన్నులపండువాయెను. కందుకావతి ఆచార్లను కూర్చుండఁ బెట్టెను.

'ఆలోచన అంతమాయెనా?'

'ఆహా !'

'నీపేరు.'

'రంగనాథుఁడు.'

'నిక్కమే?'

'ముమ్మాటికి.'

కందుకావతి మగ్గమునుండి మూఁడుతంతువులు తెచ్చి పసుపురాచి అతని మెడలో వైచెను. రంగనాథుఁడు పసుపుకొమ్మొకటి వెదకితెచ్చి దారమునకుఁ గట్టి కందుకావతి మెడలోఁ గట్టెను. కట్టినతరువాత 'లోఁగడ నామాటయు ఇప్పటి ఈ చేతయు సరిగా లే' వనుకొనెను. కందుకావతి తలుపులు మూసెను.

౪

తిరునాంచారమ్మ పను లన్నియు తీర్చుకొని తీరికగా కూర్చుండెను. ఆమె వీథిలోనికి వెళ్లనున్న కుమారునితో 'నాయనా! పెండ్లిమాట యేమి?' అనెను.

'ఉండవమ్మా! ఇఁక నెలలో పరీక్షలు తేలును. తేలిన వెనువెంటనే నీకాలిముందు కోడలు.'

'కాదు నాయనా! నేను మంచిసంబంధము విచారించితిని. వారు నిరుపేదలు. పిల్లను చిదిమి దీపము పెట్టవచ్చును. చదువుల సరస్వతి. నేనిఁక పనిపాటలకు పనికిరాను. మగఁడు లేని ఆపిల్ల అక్కయు, తల్లియు నాచేతి కక్కఱకువత్తురు.

'ఏమీ ? ఆపిల్లఅక్క ? ఆహా ! నే నెఱుఁగుదును. ఆలోచింపుము.'

'వేయేండ్లు వర్థిల్లు నాయనా వేయేండ్లు వర్థిల్లు! బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదు.'

ఆచార్లు లోలోపల 'అక్క? అక్క?' అనుకొనుచు అతిపనిమీఁద వెళ్లిపోయెను. తిరునాంచారమ్మ తొండరడిప్పొడి యాళ్వారుపాట పాడుకొనుచు గుమ్మములో కూరుచుండెను. పొరుగింటి కోయిలకుంట పున్నయ్య తిరునాంచారమ్మతో కాలక్షేపమునకు వచ్చెను.

'ఏమి నాయనా! భోజనము లయినవా?'

'అయినవి కాని ఏమిపాట' అది?

'తొండరడిప్పొడియాళ్వారుపాట.'

'అబ్బ! మధ్య వైష్ణవమునకు నామములుపెద్ద! విప్రనారాయణచరిత్ర మనరాదూ?'

'పోనీ! ఔను నాయనా!'

'తగినదే పాట!'

'ఏమి నాయనా?'

'తగినదే అంటినిగా తగినదే.'

'అనఁగా?'

'మనవాఁడూ.........మనవాఁడు—ఇపుడు విప్రనారాయణుఁడే. పోనీ! మీ అఱవమాటలో ఏదీ? ఆపాడి! ముక్కుపొడి! తొండరడిప్పొడి!'

'అదియేమి నాయనా? మావాఁడు పరీక్ష తేలఁగనే పెండ్లాడును. పిల్ల తెలియునా?'

'అంత సాగుచో పెండ్లి ఎందులకవ్వా?'

'మానాయన అనినచో గిట్టనివాళ్లు అట్లు చెప్పుదురు.'

'అతనికి పెండ్లి, శోభనము ఒకపర్యాయమే అయిపోయినవి.'

'కాలేదు నాయనా, గిట్టనివాళ్లెవరు చెప్పిరి నీకు?'

'అవ్వా, ఈకాలపువారి పెండ్లిండ్లిఁక ఈ విధముగనే జరుగును. కులగోత్రములతో పనిలేదు. బాజాబజంత్రీలు

వలదు. మంగళసూత్రముల మాట లేదు. కోర్టులలో పేరులు రిజస్టరు అగును. తీఱిపోవును.'

'కాదు నాయనా, ఏలోకపుమాట లివి? మా నాయనకు ముహూర్తము కూడ పెట్టించితిని. అద్వైతులకుఁగూడ విందు లేర్పాటు చేసితిని. నీవు రావలయుఁ జుమీ! గిట్టనిమాట లెందుకు?'

'గిట్టనిమాట లేమిటమ్మా! నేను నా కనులతో చూడఁగా?'

'నీకనుల కేదో జబ్బు! రెండురోజులు చనుబాలు పోయించుకో! మానాయన అటువంటివాఁడు కాఁడు. కాఁ డంటే కాడు. నమ్ము.'

ఇటులు వారు మాటలాడుకొనుచుండఁగా ప్రతివాది భయంకరం రంగాచార్యులు ఉబుసుపోక అవ్వతో నవ్వ వచ్చెను.

పున్నయ్య—'అవ్వా! నామాట నమ్మనిచో మీ రంగణ్ణి అడుగుము!' అనెను.

రంగ—'ఏమది ?'

తిరు—'ఏమిలేదు ఏమిలేదు ఎందుకువేళాకోళము?'

పున్న—'మన తిరుమలయ్య ముచ్చట.'

రంగ—'అవ్వా ! ధన్యురాలవు ! అఱువైన కర్చు లేక ఆఁబెయ్యయంత కోడలు. మీరిక బట్టలు కొన నక్కఱ లేదు. శుద్ధ స్వదేశీ-స్వగ్రామ-స్వచేతి-ముతకగుడ్డలు.'

తిరు—'ఏమిటి బాబూ! మీ వందలవి గిట్టనిమాటలు ; మీ రెన్ని యేని అనుఁడు. మావాఁ డటువంటివాఁడు మాత్రము కాఁడు.' అని లోనికిఁ బోయి తలుపులు మూసికొనెను.

'అగుచో మీవాఁ డిప్పు డెచట' అని బయటినుండి వినఁబడెను.

'ఏమో! ఏపనిమీఁద బయటికి వెళ్ళినాఁడో! గిట్టని మాటలు నాకేల ?' అనుకొనుచు ఆమె పాశరములు పాడఁదొడఁగెను.

౫

ఇంటర్మీడియేట్ పరీక్షలలో జయము నొందినవారి పేరులు ప్రకటింపఁబడెను. తిరుమలరాయ్ పేరు మునిమొదట.

ఆచార్యు లెన్నిసు సహచరులకును, ఇతరులకును ఫలాహారము లొసఁగెను. అందఱును చదువులో అప్రతిముఁడ వని అతని కీర్తించిరి. టెన్నిసు సహచరులు 'కందుకప్రియ' 'టెన్నిసు రంగనాథ' అనుబిరుదు లిచ్చిరి.

నాఁడు అతనితల్లి పులిహోర, వడలు, ఇడ్లు లోనగు పిండివంటకములును, తంగళి కరియామధు లోనగు పచ్చళ్లను చేసెను. తిరువారాధన చేయించెను.

సాయంకాలమున చాటుగా వచ్చి నరసింహులు పది రూకలు బహుమతి గొనిపోయెను.

నాఁడు క్రీడాక్షేత్ర మంతయు విజయవీర నాదములచే మాఱు మ్రోఁగెను. జయమందు పట్టుదల యెవరికిని లేదు. ఎవరియిష్టము చొప్పున వా రాడిరి. ఒకఁ డాకాశమునకు, ఒకఁడు నేలకు, ఒకఁడు దిగంతములకు బంతిని కొట్టెను. ఆచార్లు తనకు చిక్కిన బంతుల నన్నింటిని నేర్పుతో కందుకావతి యింటి లోనికే కొట్టెను. అందఱును—'దీనిభావమేమి తిరుమలేశ?' అనిపాడిరి. పాడిన ప్రతివానిమీఁదను 'దీనిభావమిది' అని బంతిచే ఆచార్లు సమాధానము చెప్పించెను. చీకటిపడెను.

ఆచార్లు తనయింట బంతులు వైచుట కెంత యుల్లాసము చెందెనో కందుకావతి అంత చింత జెందెను. 'ప్రేమ ఔచితి నెఱుఁగదా? లేక పాత్రనుబట్టి ఔచిత్యమా? ఔను. పెండ్లి యాడిన దానితో ఎవఁడేని యిట్టి సరసము చేయునా? చేసినను దాని యందము వేఱు' అనుకొని ముకుళించెను.

నరసింహులు పదిరూపాయలతో కుబేరుఁడై కల్లంగ డికి పోయెను. తాగెను, తాగించెను. తినెను, తినిపించెను.

బ్రాంది షాపునకు వెళ్లెను. తాగెను, తాగినంత పోయిం చెను. ఒకసీసా బట్టచాటున బెట్టుకొని ఇంటికి వచ్చెను. మంచము మీఁద కూర్చుండి సంగీతములు తీసెను. 'రంగీ'యని పలుమాఱు లఱచెను. 'రంగీ! ఏల దుఃఖము ? ఏల కన్నీరు ? జగతియంతయు ఆనందము. ఆనందింపుము, సుఖింపుము, క్రీడింపుము!' అని యని మగతలో పడెను. పోయెను నరకమునకో లేక స్వర్గ మునకో !

రాత్రి పదిగంటలకు కందుకావతి తలుపుమీఁద చప్పుడు. విని కందుకావతి ఊరకుండెను. నరసింహులు లేచి—'ఏల ఊర కున్నది? మతిమాలెనా?' అనుకొని మరల కునికిపాటులు పడెను.

తలుపుమీఁద మరల మ్రోఁత. కందుకావతి తలుపు తీసెను. ఆచార్లు గదిలోనికి వెళ్లెను. కందుకావతియు.

ఆచార్లు 'ఇవిగో నీకు కానుకలు!' అని కొన్ని ఆభరణ ములను వలువలను దీసి బల్లపైఁ బెట్టెను.

కందుకావతి—'తమరు పరీక్షలో మునిమొదట జయ మందుటయే నాకు అన్ని కానుకలును. నాకేమి ఈ బహుమతు లేమి? కన్నవారును విన్నవారును నవ్వరా?' అనెను.

'నీవు వీని నిపుడు ధరింపవలెను.'

'అటు లనవలదు. నాకొక ప్రతిజ్ఞ కలదు. అది చెల్లు వఱకు తాల్పను. కానిచో మీఁదయచే లోఁగడనే బంగారు పిచ్చుకను గానా?'

'ఏ మా ప్రతిజ్ఞ ?'

చెప్పెను.

'పోసి తీసి దాఁచికొనుము.'

'మాయిల్లు మీ రెఱుఁగనిదికాదు. పొరుగింట దాఁచి రానా?'

'మంచిది.'

కందుకావతి పోయి తిరునాంచారమ్మను లేపెను. 'మీ అబ్బాయికి సంబంధము కుదిరెనా?' అని అడిగెను. 'కుదిరె' నను ప్రత్యుత్తరము విని—'తమకొడుకు పిల్లకు నగలు చేయించెను; మీ కిమ్మని నాచే పంపెను' అని యిచ్చెను. తీసికొని తిరునాంచారమ్మ తలుపులు మూసికొనెను.

ఆచార్లు ఆనందముతో శయ్య సవరించుకొని పడుకొని దిగి మరల సవరించుకొని పడుకొనెను. తల యెత్తి దిండ్లు సరిగా పెట్టుకొనెను. లేచి మరల దిండ్లను సరిచేసికొని శయనించెను.

కందుకావతి తలుపులు మూసెను. ఆచార్లది దొంగ నిద్ర కాదు. ఊరకయే కనులుమూసికొనెను.

'అపుడే నిదురయా?'

'ఈరేయి యంతయు లేదు నిదుర.'

ఈమాట విని నరసింహులు లేచి కూర్చుండెను. అత నికిని లేదు నిదుర.

సుఖపారవశ్యముచే కొందఱకు నిదుర రాదు. దుఃఖ పారవశ్యముచే కొందఱకు రాదు. కర్మకు సుఖదుఃఖములే కందుకఖేల.

లోపల పరిహాసములు పాటలు; బయట బండుబూతులు రోదనములు. లోపల వలపు పలుకులు వాటపు ముద్దులు; బయట తలయూపులు దంతనిష్పీడనములు. లోపల పరిమళ

నిశ్వాసములు ప్రేమశపథములు; బయట వేఁడి యూర్పులు కోపశపథములు. లోపలను బయటను కాలజ్ఞానము లేదు.

కొక్కొ-రోకో. నరసింహులు త్రుళ్లిపడి బ్రాండిసీసా యెత్తి గడగడ తాగెను. కర్ర తీసికొని గదిగుమ్మము కాచెను.

కొంతవడికి తలుపులు విడివడెను. చెట్టాపట్టాలు పట్టుకొని ఇరువురును వచ్చిరి. ఆచార్ల తలపై మృత్యుదండమువలె నరసింహులు దండము పడెను. కందుకావతి ఆచార్ల తలవంచి తనతల అడ్డుపెట్టెను. తల పక్కనపగిలెను. మరలఎత్తిన కర్ర వెంట రక్తముకాఱి నరసింహులు తలతడిసెను. కందుకావతి మరల ఆచార్ల తలమీఁదఁ బడనున్న కర్రను లాగుకొనెను.

ఆచార్లు తెల్లబోయెను.నరసింహులనొకత్రోపు త్రోసెను. ఆతఁడు గోడపైఁబడెను. ఆచార్లు గొంతుక పిసుకఁబోయెను.

కందుకావతి—'చంపకుము.'

'ఛీ చంపెదను.'

'చంపకుము. ఇది ఆజ్ఞ'

'నీయాజ్ఞ యేమి? చంపెదను.'

'చంపఁదలచిన నేను చంపలేక పోతినా? చంపకుము. చంపితివా?'

'ఏమి చంపిన? నీవు చూచుచుండఁగా చంపిన? ఏమి చేయుదువు?'

'ఛీ చంపకు! నాకు స్మృతి పోవుచున్నది లేకున్న నిన్ను నెట్టివైచియుందును.'

ఆచార్లు నరసింహాలులను మరల త్రోసెను. అతఁడొక గోడపై బడెను. మరల త్రోసెను. కందుకావతి కూలఁబడి వారించెను. వారించిన కొలఁది త్రోసెను. అతఁడు మంచముపైఁ బడెను. తల మంచపు కోడుమీఁద. ఆచార్లు రెండుచేతు లెత్తి కొట్టెను. రక్తము చూచి వదలెను.

కందుకావతి 'నీవిచట ఒక నిమిషమేని ఉండవలదు పొమ్ము పో' మ్మనెను. ఆచార్లు 'వెళ్ల' ననెను.

'ఇఁక నా మొగము చూడఁజాలవు.'

ఆలోచించి ఆచార్లు వెళ్లిపోయెను.

క్రమముగా కందుకావతి ఎఱుక బాసెను. రెంటితలల నుండి రక్తము మాత్రము జాగరిల్లెను.

వారును వీరును పోగయిరి. శాంతిని భంగింప పోలీసులు వచ్చిరి. ఆసుపత్రి డాక్టరు. అతనితో నరసింహాలులకు ప్రకృతము పని లేక పోయెను. కందుకావతికి క్రమముగా తెలివి కలిగెను. పోలీసుల ఆర్భాటము హెచ్చెను. కందుకావతి అచట వారి కేమి చెప్పను తిరస్కరించెను.

పోలీసు కేసు. నరసింహాలులు తప్ప తాగివచ్చి తనను కర్రతో మోఁదె ననియు, తాను తోయఁగా మంచపుకోటికి వానితల కొట్టుకొనె ననియు, పిదప స్మృతితప్పి పడిపోతిననియు

కందుకావతి చెప్పెను. ప్లీడరు ఆచార్లమాట తేఁగా 'స్త్రీల మర్యాద కోర్టువారు కాఁపాడ వలె' ననెను.

పోలీసువారు ఆచార్లవద్ద పదివేలుమాత్రము వది లించిరి.

ప్రమాదవశమున ఈ నేరము జరిగె ననియు, తనప్రాణ రక్షణకు కందుకావతి తోసె ననియు, 'దాన తల ఆనుషంగిక ముగా కోటకి కొట్టుకొనె ననియు' దానిని పోస్టుమార్టమ్ నిర్ధారించె ననియు, శిక్షతగ్గించి రంగనాయికకు మూఁడేండ్ల ఆరు నెలల విడి ఖైదు కోర్టువారు విధించిరి.

౬

కందుకావతికి కోర్టు శిక్ష విధించెను. సంఘము ఆచార్లను వెలివేసెను.

న్యాయదండమునకు లోకుల అనుకంపకలదు. దండితున కొకవిధముగా మనశ్శాంతియు కలదు.

వెలి, సంఘము విధించిన దండము. వెలి యను ఉచ్చును ఎవరును జాఱుదీయరు; పైగా బిగింతురు. అది మహాంచి మచ్చు.

కందుకావతి ఆచార్లకు బదులు తాను శిక్ష పడెను. నీర వముగా భరించెను. ఆచార్లు తనదోషమునకే తాను వెలిపడెను. అది అతనికి హృద్రోగము. అతఁడు సంఘముమీఁద పండ్లు పట పట కొఱికెను. అందఱకు సంబంధించిన పిల్లను జేసికొని సంఘ మును పాదాక్రాంతము చేసికొన నూహించెను.

చెఱసాలలో కందుకావలికి అందఱును చుట్టములే. జైలుసూపర్నెంటు కందుకావలిని నూలుపనిమీఁద మేస్త్రీగా నియమించెను. కందుకావలి యనిన అందఱకు అతి మర్యాద.

ఆచార్లయింటికి ఎవరును రారు. అతనిని ఎవరును భోజనమునకు పిలువరు. మెన్నిసుకోర్టుకూడ అతనికి మన్నా. అతఁడు అందఱను ద్వేషించెను. తనవాచాలత నుపయోగించి ఒకజట్టు లేవఁదీయుట కిది కలకత్తా కాదు. చేయఁదగిన దేదియు లేదు. సంఘము మీఁద కసి. దీనికి పునాది కందుకావలి.

ఈహడావడిలో కాలేజిరోజులు దాఁటిపోయెను. అతఁడింటికడనే ఉండవలసివచ్చెను. ఇది యొక ముప్పు. పదివేలు అప్పు. చేతిలో తగినంత ద్రవ్యములేదు. వెలి ఖాయపడియుండుచో దేవాదాయము కూడ రాదు. ఇది యొకసంకటము.

'నగలు చేయించి కందుకావలి కిచ్చితిని. అవియే యుండుచో ఒకదెబ్బన పెండ్లికాకుండునా ?' అని ఆచార్లు చింతించుచుండెను.

తల్లి—'ఏమినాయనా ! పిల్లను విచారించి రానా ? అనెను. 'ఏమిపెట్టి విచారింతువు?' అని కొడుకనగా పెట్టెలో నుండి నగల మూటతెచ్చి 'ఇదిగో ! ఆనాఁడు నీవు పెండ్లికూఁతునకుఁగాను చేయించి నా కిమ్మని ఎవరిచేతనో పంపిన నగలమూట ! ఈనగలుపెట్టి విచారింతు'నని తల్లియనెను.

ఆచార్లు నగలు చూచెను. 'అమ్మా ! నీకిచ్చిన దెవరు ?'

'ఎవరో చీకటిలో; నీవు కాదు నాయనా పంపినది ?'

ఆచార్యుల నిర్విణ్ణుఁడు. మాటలేదు; పలుకులేదు. తెలిసిన మూర్ఛ.

'నీవు కాదా? పంపినది?'

'ఔను.'

'ఇంకేమి.'

తిరునాంచారమ్మ ఆనగలతో నంబూరు తిరుమలమ్మ కడకు వెళ్లెను.

తిరుమలమ్మకు ఆ నగయు నుత్రయు పాముమీఁదిరత్నము. అయినను బంగారము. కాని సంఘములో వెలి. అయినను వరుఁడు అదృష్టలభ్యుఁడు. కాని లోకనింద. అయిన నేమి? పిల్లకు స్వర్గసుఖము.

తుదకు తిరుమలమ్మ యిటు లనెను. ఈనగలు ఇపుడు వలదు. పెండ్లికాలమున పెట్టవచ్చును. పెద్దలను కనుఁగొని అంగీకారమును కొలఁదిరోజులలో తెలిపెదను.

తిరునాంచారమ్మ ఆనగలను మరల చింతవలె మూటకట్టుకొనెను. సంగతు లన్నిటిని కుమారునికి తెలిపెను.

నరసింహులు చావు అతనిని బాధింపలేదు. తనకు బదులుగా కందుకావతి గాయముచెందుట బాధింపలేదు. తనను తప్పించి కందుకావతి చెఱఁబడుట బాధింపలేదు. వెలి అతనిని బాధించెను. కందుకావతి నగలను తనతల్లికిచ్చుట బాధించెను.

తిరుమలమ్మ నగలను తిప్పి పంపుట అతనిని బాధించెను. దీనికి కారణము కందుకావతియే.

దినములు గతించెను; మాసములు గతించెను. తిరుమలమ్మకూఁతుపెండ్లి అయిపోయెను. అయినట్లు కొన్నాళ్లకు నంబూరినుండి వచ్చిన కాపాకఁడు చెప్పెను.

ఆచార్ల కిపుడు కందుకావతియందము వికారమాయెను. దానిమాటలు మాయమూటలు; చేఁతలు కత్తికోఁతలు. లోఁగడ కొన్నివిషయములలో తనను రక్షించుట ఎపుడో తనను భక్షించుటకే. నగ లిడుట తన్నీస డించుటకుఁగాక వేఱేమి?

అతని కుపశాంతి లేకపోయెను. కేవల మందులకే కాలేజిలోఁ జేరెను.

౭

తిరునాంచారమ్మ ఒకనాఁడు పక్కలోది పక్కలో ప్రాణములు విడిచెను. ఆఱుమ్రుగ్గిన పందు ఆర్భాటము లేకయే రాలును.

రాయి కలకత్తానుండి వచ్చెను. ఏకర్మయు చేయలేదు. భద్రాద్రిరాముని సేవింపలేదు. పరీక్ష ఓడెనో గెలిచెనో తెలిసికొన పూచీ అతని కున్నటులు కానిపింపలేదు. కాని లోకులకు లేకపోలేదు.

అతఁడు తప్పినటులు టెన్నిసు-సహచరులకు తెలిసెను. ఒక పత్రిక, అతనిసంఖ్య లేనిచోట నల్లగీటుతో గోడమీఁద

నుండి వసారాలో పడుకొనిన ఆచార్లమీఁద పడెను. అతఁడులికి పడి లేచి చూచెను. వాకిటికి పరువిడి తలుపులు తెఱచి దారి కటూఇటూ చూచెను; శూన్యము.

తలుపులుమూసి తిరిగి వచ్చికాగితమును, నల్లగీటును చూచెను. తన నెంబరు లేదు. ఒక్కనిట్టూర్పు పుచ్చెను. ఆ నిట్టూర్పుతో కాకితము అరుఁగుకిందికి పోయెను.

పరీక్ష పోయినందులకు అతఁడు మరియొక నిట్టూర్పు విడువలేదు.

అతఁ డూరక ఆకాశమును జూచుచు బరుండెను. ఒక మబ్బు వచ్చుచుండెను; ఒకమబ్బు పోవుచుండెను. కానిపించు చున్న నక్షత్రములు మఱునిముసమున కానిపించుటలేదు. చంద్రుఁడంతవాఁడుకూడ మబ్బుచే మాయమగుచుండెను. తెల్లని చోట నలుపు; నల్లనిచోట తెలుపు. అతనిమదిలో ఏపరివర్తన మును లేదు.

అతనికి ఒకమేఘము రాటమువలె కనఁబడెను. అదియే మగ్గముగా మాఱెను. ఆదియే కందుకావతి యాఁయెను. మబ్బు విఱిగెను.

టెన్నిసు-బంతి పోవుటయు, తాను రంగనాయికయింటికి వెళ్లుటయు, అది బంతి దాఁచుటయు, తాను తీయుటయు, అది వెనుక వెనుక కొందుగుటయు, తాను ముద్దిడుటయు స్మృతికి వచ్చెను. 'ఆహా! కందుకావతీ' యని తలఁచుకొనెను.

పిదప, తాను నగలు కాను కిచ్చుటయు, అది తిరుగఁ గొట్టుటయు, నరసింహులు తనను జంపవచ్చుటయు, వాని చావును, తనకు పదివేలు వదులుటయు, వెలియు, తాను పెండ్లాడ యత్నించుటయు, దరిద్రపు తిరుమలమ్మ పిల్ల నీకుండుటయు స్మృతికి దగిలెను. ఇటులు చింతాసముద్రములో అతఁడూఁపిరియాడక కొట్టుకొనుచుండెను.

కవాటముపై అంగుళిధ్వని. ఆచార్లు చకితుఁడాయెను. 'ఇపుడు తనయింటికిమృత్యువు తక్క మరి యెవరు రారే! వెన్నెలయైనను నడిరేయి. బెన్నిసు వారేమో? ఐనను—ఎవరు?'

మరల అంగుళిధ్వని.

ఆచార్లు తలుపుతీసెను. తెలతెలఁబోయి వెనుక వెనుకకుఁబోయెను. లోలోపలఁ 'అపుడే ఏల వదలిరి?' అనుకొనెను.

కందుకావతి లోనికి వచ్చి తలుపులు మూసెను.

'నీవు లోనికి రాఁగూడదు. తలుపులు మూయకు. బయటికి పొమ్ము.'

'వెళ్లుటకే వచ్చితిని. తలుపులు నాకొఱకు మూయలేదు, నీకొఱకు.'

ఆచార్లు రిచ్చవడి అరుఁగుపై కూర్చుండెను. కందుకావతి సమీపించి 'ఓయీ! నీవు నేఁడు పరుండవలయును. పరుండఁగా నిన్ను నేను చూడవలయును' అనెను.

'చాల సారులు చూచితివి.'

'మరల నేడు చూడవలయును.'

ఆచార్యు—'చూడుము' అని పరుండెను.

రంగనాయిక పదతలములకడకు వచ్చి--'ఇదిగో నీబంతి! ఇంక నీబంతితో ఆడుకొనుము.'

'పడవేయుము!'

రంగనాయిక బంతిని మెల్లగా పక్కలో పడవైచి పాదములు ముట్టి వెళ్లిపోయెను. ఆచార్లు వెనువెంటనే వచ్చి తలుపులు మూసికొనెను. రంగనాయిక చప్పుడు కాకుండ బయట గొళ్లెముపెట్టి వెళ్లిపోయెను. ఆచార్లు పడుకొని ఆకాశము చూచుచు—'ఇపుడిది యేమి చేయును?' అని యాలోచించెను. గబగబ తలుపులు తెఱవఁజూచెను. రాలేదు. గోడదుమికి కందుకావతియింటికి వెళ్లెను. తలుపునకుబయట గొండ్లెము. లోపలికేఁగెను. శిథిల గృహమున శూన్యదేవత రాణివాసముండెను.

ఇంటిప్రక్క నున్న కాలువయెక్కి—'ఎవ రా ముణగానాం తేలానామ్?' అనెను.

అతఁడు నీటిలో దిగి కేవలభారమైన కేశభారమును ఒడ్డునకుఁ జేర్చెను. లావణ్యప్రవాహము ప్రవాహమునఁ గొట్టుకొనిపోయెను.

రంగనాథుఁడు కొంచెముసేపు చూచి చూచి కేశభార మును కత్తిరించి తీసికొనెను. భారహీనమైన ఆపదార్థమును నడి కాలువ లోనికి త్రోసివైచెను. ఆశరీరము నదిలో కొట్టు కొని పోయెను.

ఆతఁడు కట్టుపై కొంతదవ్వరిగి యరిగి—'నాకు అపుడా వెలి? లేక యిపుడా?' అనుకొని కుప్పునఁ గూలఁబడెను.